# విముక్తి

రచన:
శ్రీ భాస్కరరాజు నాగేశ్వరరావు.

పెద్దగా చప్పుడు.

హృదయవిశాదకమైన పురుషార్థనాధం.

వెంటనే నదిరోడ్డుపై పెద్దగుంపు పోగయింది.

సడన్ బ్రేక్ వేసి కారాపి విసురుగా డోర్ తీసి దిగి గుంపులోదూరి ముందుకు చూసింది హేమ. ఆ దృశ్యంచూసి కళ్ళుతిరిగాయి. ఒక అంబాసిడర్ కారుముందు రోడ్డుపై రక్తంమడుగులో పడివున్నా డొక యువకుడు. కొద్దిసేపట్లో పోలీసులు వచ్చారు. అంబులెన్స్ వచ్చింది. ఆ యువకుడిని ఆటునించి ఇటు కదిపారు. హేమ గుండెలు ఝల్లు మన్నాయి. ఆమె హృదయాన్ని ఏదో ఇనుపహస్తం పట్టి నొక్కినట్లనిపించింది. స్పృహలేని ఆ యువకుడిని హాస్పిటల్ లో చేర్పించారు. అతని ప్రాణాలను ఏలాగయినా కాపాడమని తనకు తెలిసిన చీఫ్ సర్జన్ తో పదేపదే చెప్పుకుంది. డాక్టర్లు మృత్యువుతో కొన్నిగంటలు హోరాహోరీ పోరాడి అలసిపోయారు. సాయంత్రం మూడుగంటలను నిరీక్షిస్తున్న హేమకు రోగిని చూడటానికి అనుమతి లభించింది. మరుక్షణం హేమ అతని మంచంప్రక్క చేరింది. అతను మృత్యుముఖంలో వున్నాడనిపించిందామెకు. బరువెక్కిన గుండెలతో 'శివా, శివా' అని మీదికివంగి మెల్లగా పిలిచింది. ఆ యువకుడు మెల్లగా కళ్లు తెరిచాడు. హేమను గుర్తించాడు. అతని కళ్లలో ఒకక్షణం వింతకాంతి కదలాడింది. పెదవివిప్పి మాట్లాడాలని ప్రయాసపడసాగాడు. అప్రయత్నంగా అతని మసలిపోయే గుండెలపై చేయి వేసింది హేమ. చల్లని ఆస్పర్శకు అతను శక్తి పుంజుకున్నాడు.

'మీరు.... హేమాదేవి.... వచ్చారా.'

'అ.... నేనే.... ఎందుకిలా అయింది? ఊరువదలి ఇలా ఎందుకు వచ్చావు' అని అడిగింది హేమ బాధతో.

అతడు క్షణంసేపు మాటాడలేదు. హేమ ముఖంలోకే చూస్తూండిపోయాడు. అతని కళ్ళవెంట బాష్పబిందువులు ధారగా స్రవిస్తున్నాయి. ముఖంలో మృత్యుబాధ గోచరిస్తోంది. ఏక్షణంలోనయినా ఆ విశాలనయనాలు శాశ్వతంగా మీద పడిపోయేలాగున్నాయి. తెల్లని అతనిముఖం రక్తస్రావంతో మరింత తెల్లగా పాలిపోయింది. అతని దుస్థితిచూసి హేమకు దుఃఖం ఆగలేదు. ఆమె కళ్ళనీళ్ళు అతనిపై పడ్డాయి.

'మీకంట నీరు.... నా.... కోసం.... అబ్బా' బాధతో మూలిగాడు అతను. తర్వాత అతిప్రయాసతో—

'నాకు.... నాకు.... విముక్తి లభించింది. సె.... సెలవు. మీ.... మీ....' ఆపైన మాట్లాడలేకపోయాడు. నాలుక ఒక ప్రక్కగా వాలిపోయింది. కనురెప్పలు సరిగా ఆడటంలేదు. కనుబొమలు పైకి లాక్కుపోతున్నాయి. శ్వాస కష్టమైపోతుంది. ఏదో హేమతో చెప్పాలని ఆరాటపడుతున్నాడు. హేమ అదిరేగుండెలతో అతనిపైకి వంగి 'శివా! శివా!' అని పిలిచింది. ఆమె ముఖంలోకి వెర్రిగా అలాగే చూశాడు. చిన్నగురక మొదలయింది. కొద్దిక్షణాలలో ఆగిపోయింది. ఆ మరుక్షణం అతని ప్రాణాలు అనంతవిశ్వంలో విలీనం చెందాయి. హేమ దుఃఖం ఆపుకోలేక బయటకువచ్చి వరండాలో మూలనగల బెంచిపై కూర్చుని పైటతో ముఖం దాచుకుంది. ఒక్కసారిగా గతం గుర్తుకొచ్చింది.

* * *

బైట కేకలువిని యింట్లోనించి పరుగెత్తుకొచ్చింది పదేళ్ళ హేమ. ఆ దృశ్యంచూసి ఆ చిన్నది హృదయం చలించిపోయింది. వేపచెట్టు కొమ్మపై శివయ్య కూర్చున్నాడు. ముగ్గురు కొంటెకుర్రాళ్లు శివయ్య ఎక్కినకొమ్మను వేగంగా ఊపసాగారు. శివయ్య భయంతో కేకలు వెయ్యసాగాడు. మరో పదిమంది బాలబాలికలు ఆ దృశ్యంచూసి సంతోషంతో చప్పట్లు కొడుతున్నారు. ఏక్షణంలోనయినా విపరీతంగా ఊగే కొమ్మపైనుంచి శివయ్య పడతాడు. హేమ కొమ్మఊపే కుర్రవాళ్ళను ఆక్షేపించింది. కాని వాళ్ళు కొమ్మ ఊపడం ఆపకుండా నిర్లక్ష్యంగా హేమవైపు చూశారు. ఊరికి కొత్తపిల్ల మమ్మల ఆక్షేపిస్తుందా అన్న కోపంతో కొమ్మను యింకా గట్టిగా వూపారు. శివయ్య క్రిందపడ్డాడు. పిల్లలంతా సందడిగా కేకలు వేశారు. శివయ్య మోచేతులూ, మోకాళ్ళూ దొర్లుకుపోయి రక్తం కారసాగింది. హేమ చిన్నారిహృదయం విలవిలలాడింది. పడిపోయిన శివయ్యను లేవదీసింది. వంటికి అంటుకున్న మట్టిని విదలించింది. శివయ్య బెరుగ్గా కృతజ్ఞతగా హేమ కళ్ళలోకి చూశాడు. పిల్లలంతా పారిపోయారు. శివయ్య యజమాని కోపంతోవచ్చి శివయ్య తప్పులేదని హేమ చెబుతున్నా వినకుండా ఎడాపెడా తన్నుకుంటూ యింటికి లాక్కెళ్ళాడు.

'పిన్నమ్మా! ఆ అబ్బాయి తప్పేంలేదు. క్రిందపడి దెబ్బలు తగిలి వాడేదుస్తుంటే ఆయన పైగా కొడతా దేమిటి?' అని అడిగింది హేమ.

'అతనంతే. ఆ పిల్లవాడిని ఏదో పల్లెటూరినించి తీసుకొచ్చారు.

'ఎందుకూ?'

'వెట్టిచాకిరీ చేయించుకోడానికి. అయినా నీకెందుకే యివన్నీ. ఉన్న నాలుగురోజులూ హాయిగా తిని ఆడుకోక' అంది హేమ పిన్నమ్మ.

హేమ హృదయం చక్కగా మూలిగింది. శివయ్య దీనమైన ముఖం. అతని యజమాని ఉగ్రస్వరూపం హేమ కళ్ళముందు మెదిలాయి. మరునాడు ఉదయం ఎనిమిది గంటలయింది. బాగా చలికాలం. శివయ్య యింటిముందు అరుగుపై ఎండలో కూర్చున్నాడు. అతని వడిలో సంవత్సర పాపవుంది. హేమ అతనివద్దకు వెళ్ళింది. హేమను చూడగానే శివయ్య స్నేహంగా నవ్వాడు.

'ఎందుకు నిన్ను మీ యింటాయన కొట్టాడు?' అడిగింది హేమ.

'నేనంటే కోపం.'

'ఎందుకు?'

'మొద్దువాడినని' నన్ను పిచ్చోడా అంటారందరూ. నాకేం పిచ్చి లేదండి.

'బళ్ళోకెళ్ళి చదువుకోరాదూ?'

'బడికి పంపరుగా.'

'ఎందుకూ ??'

'ఇంట్లో పనంతా చెయ్యాలి.'

'చేతిపైన వాతలేమిటి?'

'అమ్మగారు దీన్ని ఏడిపించానని అట్లకాడతో పెట్టి కాల్చారు.'

ఇంతలో శివయ్య వడినించిపాప ఏడవసాగింది, ఇంట్లోనించి గద్దింపు వినిపించింది. శివయ్య హడలిపోయి మారు మాటాడకుండా యింట్లోకి వెళ్ళాడు. కాలచక్రంలో మరి కొన్ని సంవత్సరాలు గడిచాయి.

హేమ ఫైనల్ బి. ఏ. పరీక్షలు రాశాక వేసవి సెలవులలో పిన్నమ్మగారింటికి మళ్ళీ వచ్చింది. మరునాడు తెల్లవారి కాఫీ త్రాగాక యింటిబయటకు వచ్చింది. వీరుగింటి


## రూ. 50,000/- బహుమతులని గెలవండి!!

### రొచ్నావారి ఎలక్ట్రానిక్ బహుమతులు!!

* మొదటి బహుమతి: కలర్ టి. వి. లేక రూ. 6000/- రొక్కం.
* రెండవ బహుమతి: 3 స్పీడ్ మిక్సీ లేక 2 స్పీడ్ మిక్సీ సగంధరకు.
* మూడవ బహుమతి: జపాన్ మాడల్ టూ - ఇన్ - ఒన్ లేక రూ. 960/- వెలగల ఇంటికి కావలసిన సామానులు.

ఒక తెల్లకాగితముపైన 4 నుంచి 12 వరకుగల అంకెలతో ఎటువైపు కూడినసూ మొత్తం 24 రావలెను. ఒక నంబరును ఒక తూరే వాడవలెను. ఇది పూర్తిచేసిన 15 రోజుల లోపల మాకు చేరవలెను. బహుమతుదారుల నిర్ణయం ఢిల్లీలోనే. ఒక కుటుంబంలో నుంచి ఒక ఎంట్రీయే అంగీకరింపబడుతుంది. ప్రవేశరుసుము లేదు.

పాత నమూనా మొత్తం 21

| | | |
|---|---|---|
| 10 | 3 | 8 |
| 5 | 7 | 9 |
| 6 | 11 | 4 |



**RACHNA ELECTRONICS (K.J.)**
**P. B. No. 6560**
**NEW DELHI - 110 027.**

వైపు అప్రయత్నంగా చూసింది. శివయ్య యింటిముందు కట్టెలు కొడుతూ కనిపించాడు. మాసినచొక్కా చిరుగుల పొంటుతో కూలీవానిలాగా కనిపించాడు. హేమ జాలిగా నిట్టూరుస్తూ శివయ్య దగ్గరగా వెళ్ళింది. అతను హేమను చూడగానే గుర్తుపట్టి స్నేహంగా నవ్వి-

'ఎప్పు డొచ్చారు?' అన్నాడు.

'రాత్రి వచ్చాను. బాగున్నావా?'

ఆ పలకరింపులోని ఆప్యాయతకి శివయ్య చలించి పోయాడు.

'బాగున్నాను' అని జవాబిచ్చాడు తలొంచుకొని. అతనెంత బాగున్నాడో హేమకు బాగా అర్థమయింది.

'నీపరిస్థితిలో ఎంతమాత్రం మార్పులేదు' అంది.

శివయ్య వెర్రిగా హేమ ముఖంలోకి చూశాడు. తర్వాత వెంటనే-

'మీపట్నంలో ఏదయినా ఉద్యోగం చూడరూ' అని ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

'నీవు చదువుకోలేదు. ఏం ఉద్యోగం చేస్తావు?'

'నాకు తగిన ఉద్యోగం ఏదయినా - చివరకు కూలీ పనయినా చేస్తాను. వాలీవాలని తిండి, బండెడు చాకిరీతో చస్తున్నాను. నాకు స్వేచ్ఛలేదు. నన్ను ఈ నరకంనుండి విముక్తుడిని చెయ్యండి.'

హేమ నీళ్ళు నమలసాగింది.

మీ నాన్న పెద్ద లాయరటగా, నా కామాత్రం సహాయం చెయ్యరూ. ఆఖరికి మీ కారు క్లీనరుగానైనా సరే.'

హేమకు ఏమీ తోచలేదు. కాని హేమ అనుకుంటే శివయ్యకు ఈ చెరసాల వదలిపోగలదు. కాని ఆమె ఆ క్షణంలో ఏమీ చెయ్యలేకపోయింది. కష్టాలలో ఉన్నవారిని చూసి జాలిపడటం మానవుల సహజగుణం. అయితే వారికి సహాయపడటం మహనీయుల సహజలక్షణం. మానవులంతా మహనీయులు కావాల మరి.

'హేమా, ఇలారా' హేమ చిన్నాన్న గద్దించాడు. శివయ్యనువదిలి భారంగా వెనుదిరిగింది. హేమ, మొద్దు వెధవతో ఏం మాటలని హేమ చిన్నాన్న మందలించాడు.

* * *

'అమ్మా, హేమా.'

హేమ ఉలికిపడి తలెత్తి చూసింది. హేమ నాన్నగారు కనిపించారు. ఆయన ఆతురతగా హేమను దగ్గరకు తీసుకుంటూ-

'ఏంటమ్మా? ఎవరినో హాస్పిటల్‌కు తెచ్చావట, ఎజిటే బెడ్‌గా వున్నావట. డాక్టర్ ఫోన్‌చేసి చెప్పాడు. ఏమిటి సంగతి?' అని అడిగాడు కూతుర్ని. హేమ తండ్రి ఎదపై వాలిపోయింది. ఆమె కన్నీళ్ళు ఆయన చొక్కాను తడిసాయి. అడిగినప్రశ్నే మళ్ళీ అడుగుతూ కూతురుని పోర్టికోలోని కారువైపుగా తీసుకెళ్ళాడాయన. శివయ్య కళ్ళ మూతపడింది.



విూ....

నమ్మకకు పాత్రమైన
బనియన్ల రకాలు

* అనిల్ ఫైన్ * అనిల్ కూల్ టెక్స్

* అరిసో (కలర్) * బ్రీఫ్స్ & ట్రంక్స్

——తయారించువారు:——

Phone : 22411

ANIL HOSIERY

"SIDCO" Industrial Estate :

TIRUPUR - 638 602.